**ప్రభుత్వ రంగ  సంస్థలను,** బిఎస్ఎన్ఎల్ ను కాపాడుకునేందుకు

# జనవరి 8,9 తేదీలలో జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాలకు   , కార్మిక వ్యతిరేక విధానాలకు  , ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 2019 జనవరి 8 ,9  తేదీలలో దేశ వ్యాపితముగా అన్ని  రంగాలలో రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు ఐఎన్ టి యు సి , ఏ ఐ టి యు సి , హెచ్ ఎం ఎస్ , సి ఐ టి యు తదితర కేంద్ర  ట్రేడ్ యూనియన్లు  , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలు , బ్యాంకు , ఇన్సూరెన్సు , బిఎస్ ఎన్ఎల్ తదితర ఉద్యోగుల సంఘాలు   , అసంఘటిత రంగానికి చెందిన కార్మికుల సంఘాలు  పిలుపునిచ్చాయి. బిఎస్ ఎన్ఎల్ లో బిఎస్ ఎన్ఎల్ ఈ యు , ఎన్ ఎఫ్ టి ఈ, బిఎస్ఎన్ఎల్ ఎంఎస్, టిఈ పియు లు సమైక్యముగా సమ్మె నోటీసునిచ్చాయి.  12 డిమాండ్స్ కోసం ఈ సమ్మె జరుగుతున్నది.

<u>డిమాండ్స్:</u>

1. **<u>ప్రభుత్వ రంగ సంస్థల డిజిన్వెస్ట్మెంటు, మరియు ప్రయివేటీకరణ ఆపాలి.</u>**

1991 నుండి ఇప్పటి వరకు జరిగిన డిజిన్వెస్ట్మెంట్  , ప్రయివేటీకరణలలో కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన సొమ్ము రు. 3,62,687  కోట్లు కాగా ఇందులో  58 శాతం అమ్మకం (రు. రు. 2,09,896 కోట్లు)  మోడి గారి హయాములో ఈ నాలుగు సంవత్సరాలలో జరిగింది.
వాజపాయి గారి హయాములో బాల్కో,  హిందూస్తాన్ జింక్ లిమిటెడ్, విఎస్ఎన్ఎల్  తదితర అనేక  ప్రభుత్వ రంగ సంస్థలను అతి తక్కువ ధరకు ప్రయివేటు పరం చేయగా ఇప్పుడు మోడి గారి ప్రభుత్వము ఇదే బాటలో    డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా,  బిఈఎంఎల్, భద్రావతి, దుర్గాపూర్, సేలం ఉక్కు ఫ్యాక్టరీలు తదితర 24 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేయాలని నిర్ణయించింది. లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వానికి ఎప్పుడూ చెల్లించే డివిడెండుకన్నా  ఎక్కువగా చెల్లించాలని ఆదేశించింది. ఈ విధముగా ప్రభుత్వ రంగ సంస్థల నిధులను కొల్లగొట్టే పనిలో వున్నది.    ఓఎన్జీసీ కి అవసరం లేనప్పటికి దానితో మరో ప్ర  భుత్వ రంగ సంస్థ హెచ్ పిసిఎల్ ను రు. 41000 కోట్లతో కొనిపించి దానిని అప్పుల పాలు చేసింది. లాభాలతో నడుస్తున్న  అహ్మదాబాద్  , జయపూర్, లక్నో, గువాహతీ, తిరువనంతపురం, మంగళూరు  విమానాశ్రయాలను అమ్మాలని నిర్ణయించింది.

విజయవాడ, విశాఖపట్నం తో సహా 23 రైల్వే స్టేషన్ల నిర్వహణను ను ప్రయివేటు పరం చేయాలని  నిర్ణయించింది. రైలు ఇంజిన్ల తయారీకి ప్రభుత్వ  సంస్థలయిన చిత్తరంజన్ మరియు వారణాసి లోకోమోటివ్స్ కి మరియు ఈ రంగం లో సామర్థ్యం గల బి హెచ్ ఇఎల్ కి ఆర్డర్సు ఇవ్వకుండా ప్రతి సంవత్సరం 150 ఇంజిన్లు కొంటామనే గ్యారంటీ ఇచ్చి అమెరికాకి చెందిన జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీకి , ఫ్రాన్స్ కు చెందిన ఆల్స్టోమ్ కు ఆర్డర్సు ఇచ్చింది. రైల్వే ట్రాక్

లను ప్రయివేటు కంపెనీలు వాడుకునేందుకు వీలుగా “ రైల్వే డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా” ని ఇప్పటికే ఏర్పాటు చేసింది.

యుద్ధ విమానాలు , యుద్ధ నౌకలు , సబ్మెరైన్ల తయారీలో అనుభవం వున్న హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(బెంగళూరు), హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (విశాఖపట్నం), మజగామ్ డాక్ లిమిటెడ్ (ముంబయి) లను కాదని అనుభవము లేని ప్రయివేటు కంపెనీలయిన రిలయన్స్ మరియు ఎల్ & టి లకి ఆర్డర్సు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆధీనములో వున్న 41 ఆర్డినెన్సు ఫ్యాక్టరీలు ఇప్పటి వరకు తయారు చేస్తున్న మొత్తం 273 అయిటంస్ లో 143 అయిటంసును అవుట్ సోర్సింగ్ కు ఇచ్చింది. ఈ ప్రయివేటు కంపెనీల ఆయుధ సామగ్రి ఉగ్రవాద సంస్థ “ఇస్లామిక్ స్టేట్” చేరినట్లు లండన్ లో వున్న ఒక పరిశోధన సంస్థ వెల్లడించింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ 60 సంవత్సరాలలో మన ప్రభుత్వ రంగ సంస్థలు సాధించిన అనుభవాన్ని , సామర్ధ్యాన్ని, సాంకేతిక పరిజ్ఞాన్ని, స్వావలంబనను దెబ్బ తీసి క్రమముగా ప్రయివేటు కంపెనీలను ప్రోత్సహించి వాటి పై విదేశీ కంపెనీల ఆధిపత్యానికి దారి తీసే విధానాలు అవలంబిస్తూ దేశ రక్షణ కి ముప్పు తెస్తున్నది.

ఇంతేగాక రిజర్వు బ్యాంకు నిధులలో మూడవ వంతును (రు. 3.6 కోట్లు) ప్రభుత్వ ఖజానాకి మళ్లించాలని ఒత్తిడి చేస్తున్నది. తన రిజర్వ్ ఫండ్స్ ఏ స్థాయిలో వుండాలో నిర్ణయించే స్వాతంత్ర్యం రిజర్వు బ్యాంకుకి వుండాలి. గతం లో యుద్ధ కాలం లోనే రిజర్వు బ్యాంకు నిధులలో కొంత వాడటం జరిగింది. ఇప్పుడు ప్రజలపై యుద్ధం చేస్తున్న మోడి ప్రభుత్వము ఈ రిజర్వ్ బ్యాంకు నిధులను కూడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వాడే ప్రయత్నం లో వున్నది. ఇది రిజర్వు బ్యాంకు స్వయం ప్రతిపత్తికి వ్యతిరేకమని భావించి రిజర్వు బ్యాంకు గవర్నర్ గా వున్న ఊర్జిత్ పటేల్ పైకి వ్యక్తిగత కారణమన్నప్పటికి ఈ దురాగతాన్ని సహించలేకనే రాజీనామా చేశారు.

కార్పొరేట్సుకి సంవత్సరానికి రు. 5 కోట్ల మేరకు పన్ను రాయితీలిస్తూ , జాతీయ బ్యాంకులకు అవి భారీ స్థాయిలో తీర్చాల్సిన అప్పులు తీర్చక పోయినా పట్టించుకోకుండా, మళ్ళీ వాటికే అప్పులిచ్చేందుకు బ్యాంకుల వద్ద నిధులు లేవు కాబట్టి రీకేపిటలైజేషన్ పేరుతో ప్రభుత్వ ఖజానా నుండి బ్యాంకులకు నిధులు తరలిస్తున్నది. ఈ విధముగా ఈ 2018-19 లో రు.లక్ష కోట్లు తరలించాలని నిర్ణయించింది.

పన్ను రాయితీలు, పన్నుల ఎగవేత మరియు బ్యాంకుల రికేపిటలైజేషన్ల వలన ఏర్పడే లోటును తగ్గించుటకు ప్రభుత్వ సంస్థల వాటాల అమ్మకాన్ని ప్రయివేటీకరణని భారీ స్థాయిలో అమలు చేస్తున్నది. ఈ విధానాలలో భాగముగానే అడ్డగోలుగా 4 జి స్పెక్ట్రమ్ సాధించిన రిలయన్స్ జియో ని ప్రోత్సహించి ఉత్పత్తి ఖరీదుకన్నా తక్కువ ధరలకి సేవలందించేందుకు దానిని అనుమతించి ఈ పోటీలో నిలబడేందుకు తాను కూడా ఇదే పద్ధతిలో ధరలను తగ్గించాల్సిన పరిస్థితిని సృష్టించి నష్టాలనుండి కోలుకుంటున్న బిఎస్ఎన్ఎల్ ను మళ్ళీ నష్టాలు పెరిగే పరిస్థితికి దిగజార్చింది. మన వేతన సవరణ దీని వలన కఠినతరమవుతున్నది. బిఎస్ఎన్ఎల్ లో మనము ఐక్యముగా వుండి పోరాడుతున్నందున నష్టాలలో వున్నప్పటికి వేతన సవరణ పై మంత్రిగారు ఏయూ ఏ బి నాయకులను చర్చలకు పిలిచేలా చేయగలిగాము. కొన్ని హామీలు సాధించగలిగాము. కానీ మనము సాధించినది వమ్ము

కాకుండా వుండాలంటే ఈ విధానాలు మొత్తముగా మారాలి. అన్ని రంగాల కార్మికులు , ఉద్యోగులతో పాటు మనము ఈ రెండు రోజుల దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె లో పాల్గొని జయప్రదం చేయాలి. ఆ విధముగా ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి.

2. **బోనస్, ఈపీఎఫ్, డిసిఆర్జి లపై వున్న అన్ని రకాల సీలింగులను రద్దు చేయాలి. గ్రాట్యుటి ని పెంచాలి**

**బోనస్ చట్టం** ప్రకారం అర్హతకు సీలింగు రు.21000 గా వున్నది. బోనస్ లెక్కింపుకు ప్రాతిపదికగా వుండే వేతనం పై రు.7000 సీలింగు, బోనస్ చెల్లింపు సంవత్సర కాలం వేతనం లో 20 శాతం మించ కూడదని మరో సీలింగు అమలు లో వున్నది. యాజమాన్యాలకు లాభాలపై లేని పరిమితిని కార్మికుల బోనస్ ఎందుకు విధించాలి? కాబట్టి ఈ 3 సిలింగులు ఎత్తి వేయాలి . బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ఉత్పాదకత ఆధారముగా పి ఎల్ ఐ (ప్రొడక్టివ్ లింక్డ్ ఇన్సెంటివ్) ఇస్తూ వచ్చారు. కానీ బిఎస్ఎన్ఎల్ కు నష్టాలు వచ్చిన అనంతరం దీనిని ఆపు చేశారు. ఒక్క 2014-15 లో మాత్రమే నష్టాలు వచ్చినా అందరికీ రు.3000/- పి.ఎల్.ఐ ఇచ్చారు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా కనీస పి ఎల్ ఐ రు.7000/- ఇవ్వాలని , ఉత్పత్తి ప్రమాణం ఒక నిర్దిష్ట స్థాయికి చేరితే పి ఎల్ ఐ ని మరింత పెంచేందుకు ఒక ఫార్ములా ని రూపొందించాలని డిమాండ్ చేస్తున్నాము.

**ఈ పి ఎఫ్ చట్టం** ప్రకారం ఉద్యోగి వేతనం (పే ప్లస్ డి ఏ) ఎంత వున్నా ఆ వేతనం పై 12 శాతంను ఉద్యోగి తన ఈపీఎఫ్ ఖాతాకి చెల్లించవచ్చు. కానీ మేనేజిమెంటు , ఉద్యోగి ఈపిఎఫ్ ఖాతాకి కంపల్సరీగా చెల్లించాల్సిన 13.61 శాతాన్ని లెక్కించేందుకు రు.15000/-వేతన సీలింగు పై లెక్కించాలి. మేనేజిమెంటు కావాలనుకుంటే మొత్తం వేతనం పై లెక్కించి చెల్లించ వచ్చు. బిఎస్ఎన్ఎల్ మేనేజిమెంటు డైరెక్ట్ రిక్రూటెడ్ ఉద్యోగుల మొత్తం వేతనం పై ఈ 13.61 శాతాన్ని చెల్లిస్తున్నది. కానీ కంపెనీ ఆర్థిక పరిస్తితి బాగా లేదు , ఈ మొత్తాన్ని చెల్లించలేమని అనుకుంటే రు.15000/- సిలింగు ప్రకారం చెల్లించ వచ్చు. కాబట్టి ఈ రు.15000/- వేతన సీలింగుని రద్దు చేయాలి.

**డి సి ఆర్ జి** (డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటి) చెల్లింపుకి రు.20 లక్షలు , లెక్కింపుకి 16.5 నెలల వేతనం అనే సిలింగులున్నాయి. ఈ పరిమితుల వలన చేసిన సర్వీసు కు తగిన విధముగా గ్రాట్యుటీ చెల్లించటం లేదు. కాబట్టి ఈ రెండు సీలింగులను రద్దు చేయాలి.

3. **కార్మికులందరికి సామాజిక భద్రత, అందుకు తగిన నిధుల కేటాయింపు**

మోడి ప్రభుత్వము **ఇప్పటి వరకు ఈ పి ఎఫ్ నిదులనుండి రు.41000 కోట్లను షేర్ మార్కెట్ కు తరలించి ఈపీఎఫ్ నిధుల భద్రతను గాలిలో దీపం లాగా చేస్తున్నది.** ఈపీఎఫ్ ను పిఎఫ్ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ పర్యవేక్షణలో వున్న పెన్షన్ ఫండ్ కంపెనీలకు వెళ్ళేందుకు ఆప్షన్ ఇచ్చింది. ఈ నిధులకు ఎసరు పెట్టటం లో ఇదొక భాగం.

ఈపీఎఫ్,ఈఎస్ఐ, సిఎంపిఎఫ్, ఎంప్లాయీస్ కంపెన్సేషన్ చట్టం , బిల్డింగ్ మరియు కంస్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ చట్టం , గ్రాట్యుటీ చెల్లింపు చట్టం, బీడీ వర్కర్స్ వెల్ఫేర్ చట్టం తదితర 15 రకాల సాంఘిక భద్రతా చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో ఒకే ఒక **సోషల్ సెక్యూరిటీ కోడ్** ఏర్పాటు చేయాలని మోడి ప్రభుత్వము ప్రతిపాదించింది.

ఈ కోడ్ ప్రకారం రు.11 లక్షల కోట్లకు పైగా వున్న , అత్యధిక భాగం కార్మికుల ఉద్యోగుల కష్టార్జితం వలన ఏర్పడిన ఈ సంస్థల నిధులను ప్రధాన మంత్రి అధ్యక్షతన ఏర్పడే " నేషనల్ సోషల్ సెక్యూరిటీ కవున్సిల్" కు జమ చేస్తారు. ఈ సోషల్ సెక్యూరిటీ కవున్సిల్ లో కార్మిక సంఘాల తరఫున ఇప్పుడున్న 6 గురికి బదులు ఇద్దరు మాత్రమే ప్రతినిధులుగా వుండాలి. ఈ నిధులను షేర్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టినా అందుకు కవున్సిల్ నుండి వ్యతిరేకత రాకుండా ఈ ఏర్పాటు చేశారు. తమ కార్పోరేట్ బాస్ ల ప్రయోజనం కోసం ఈ నిధులను షేర్ మార్కెట్ లో పెట్టటమే ఈ సోషల్ సెక్యూరిటీ కోడ్ ఉద్దేశం. కానీ ఈ కోడ్ వలన కార్మికులకు ఇప్పటికన్నా సామాజిక భద్రత తగ్గుతుంది. ఈ ప్రతిపాదిత కోడ్ లో కార్మికులు సామాజిక భద్రతకి ఎంత చెల్లించాలో వున్నది కానీ యజమానులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత చెల్లించాలో లేదు. ఇంతేగాక 40 లోపు కార్మికులుండే ఫ్యాక్టరీలకు కార్మిక చట్టాలు వర్తించవని ఈపాటికే మోడి ప్రభుత్వము ఫ్యాక్టరీల చట్టాన్ని మార్చినందున ఫ్యాక్టరీ కార్మికులలో 72 శాతానికి ఈ సాంఘిక భద్రత పథకం వర్తించదు!

ఈ కోడ్ గనుక పార్లమెంటు ఆమోదం పొంది చట్టముగా మారితే కార్మికులకు ఇప్పుడున్న విధముగా ఈపిఎఫ్ , ఈఎస్ఐ, లో వున్న ప్రయోజనాలు లభిస్తాయా , బీడీ కార్మికుల చట్టం లో వున్న విధముగా గృహ నిర్మాణానికి మద్దతు లభిస్తుందా? రద్దు చేయబోయే ఈ 15 చట్టాలలో వున్న ప్రయోజనాలు లభిస్తాయా ? వీటికి ఈ కోడ్ లో జవాబు లేదు!. ఈ "సోషల్ సెక్యూరిటీ కోడ్ " అనేది నిజానికి "సోషల్ ఇన్సెక్యూరిటీ కోడ్" అని మనము అర్థం చేసుకోవాలి. ఈపిఎఫ్ చట్టం 10 లేదా 20 మంది లోపు కార్మికులున్న సంస్థలకు వర్తించదు. కానీ ఈ పరిమితులను రద్దు చేసి కార్మికులందరికి వర్తింప జేస్తే ఈపీఎఫ్ చట్టం వర్తించే కార్మికుల సంఖ్య ఇప్పుడున్న 4 కోట్ల నుండి 8 కోట్లకు పెరుగుతుంది. 10 లోపు కార్మికులున్నా వర్తింపజేస్తే ఈ ఎస్ ఐ వర్తించే కార్మికుల సంఖ్య ఇప్పుడున్న 3 కోట్ల నుండి 9 కోట్లకు పెరుగుతుంది. కాబట్టి ఈ ప్రతిపాదిత బిల్లుని ఉపసంహరించాలని , కార్మికులందరికి వారు సంఘటిత రంగం లో వున్నా అసంఘటిత రంగం లో వున్నా సామాజిక భద్రత (ఈపీఎఫ్, ఈ ఎస్ ఐ మొదలగునవి) వర్తించాలని అందుకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాము.

4. **కార్మిక చట్టాలలో వున్న హక్కులను ఖచ్చితముగా అమలు చేయాలి. ఉల్లంఘించిన యాజమాన్యాలను కఠినముగా శిక్షించాలి.**

సరళీకరణ విధానాలను ప్రవేశ పెట్టిన తరువాత కార్మిక హక్కుల అమలును పర్యవేక్షించే బాధ్యత ను కార్మిక శాఖ క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నది. కార్మిక శాఖఅధికారులు ఫ్యాక్టరీలను ఇన్స్పెక్ట్ చేయటం తగ్గించారు. ఇన్స్పెక్షన్ రేటు 1991 లో 75.64శాతం వుండగా 2008 నాటికి17.88 శాతానికి పడిపోయింది. కార్మిక శాఖకు తగినంత మంది సిబ్బంది లేనందున కార్మిక చట్టాల అమలును పర్యవేక్షించటం తగ్గుతున్నదని పార్లమెంటరి స్టాండింగ్ కమిటి నివేదిక తెలియజేసింది. అయినప్పటికీ గత యుపిఎ ప్రభుత్వ ము గాని, నేటి ఎన్డి ఎ ప్రభుత్వ ముగాని దీనిని పట్టించుకోటం లేదు. దీని ఫలితముగా కార్మిక చట్టాల ఉల్లంఘున ఎక్కువైంది.

ఇప్పటికి60 శాతం మంది సంఘటిత రంగ కార్మికుల కు చట్టబద్ధమయిన కనీస వేతనాలు, ఇ పి ఎఫ్, ఇ ఎస్ ఐ అమలు కావటం లేదు. అనేకపారిశ్రామిక, సర్వీసు యునిట్లలో ఓటి లేకుండా 8 గంటలకు మించి రోజు 10 లేదా 12 గంటలు పని చేయించటం జరుగుతున్నది. ఎక్కువ పనిగంటలు చేయించడం అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజషన్ సూత్రాలకు విరుద్ధం . అనేక పారిశ్రామిక యూనిట్లను యాజమాన్యాలు చట్ట విరుద్ధముగా మూసి వేస్తున్నాయి. అయినాకేంద్ర, రాష్ట ప్రభుత్వాలు పట్టించుకోటం లేదు. చట్టాల ఉల్లంఘున రూపం లో జరుగుతున్న ఈ తీవ్రమయిన దాడి కారణంగా తయారి రంగం లో సృష్టించ బడిన నికర విలువ లో కార్మికుల వేతనాల వాటా 1981 -82 నాటికి 30.28 శాతం కాగా 2010-11లో 12.16 శాతం కు పడిపోయింది. కాగా యజమానుల లాభం వాటా ఇదే కాలం లో 20 శాతం నుండి 50 శాతం కు పెరిగింది. ఇదే కాలం లో కార్మికుల శ్రమ ఉత్పాదకత 5 రెట్లు పెరిగింది. ఈ దోపిడి ని నివారించేందుకు కార్మిక చట్టాలను ఖచ్చితముగా అమలు చేయాలని , ఉల్లంఘించిన యాజమాన్యాలను కఠినముగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము.

5. **కార్మిక హక్కులు రద్దు చేసేందుకు కార్మిక చట్టాలకు తలపెట్టిన సవరణ లను విరమించాలి.**

మోడి ప్రభుత్వము ఇప్పుడున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో నాలుగు కోడ్స్ ను ప్రతిపాదించింది.

**పారిశ్రామిక సంబంధాల కోడ్:** సమ్మెలను మరియు యూనియన్ల ఏర్పాటును అసాధ్యం చేసేందుకు , కార్మికులను తమ ఇష్టా రాజ్యముగా తొలగించే హక్కుని యాజమాన్యాలకు దఖలు పరిచేందుకు , కార్మికులను మరియు ఉద్యోగులను బానిసలుగా మార్చేందుకు ట్రేడ్ యునియన్ చట్టాన్ని, పారిశ్రామిక వివాదాల చ ట్టాన్ని, స్టాండింగ్ ఆర్డర్స్ చట్టాన్ని కలిపి పారిశ్రామిక సంబంధాల కోడ్ గా మార్చాలని మోడి ప్రభుత్వము ప్రతిపాదించింది.

ప్రస్తుత చట్టం ప్రకారం 14/21 రోజులు ముందుగా సమ్మె కి నోటిసునివ్వాలి. కానీ ఈ ప్రతిపాదిత కోడ్ ప్రకారం 6 వారాలు ముందుగా నోటిసునివ్వాలి. లేబర్ కమిషనర్ కన్సిలియేషన్ కు పిలవక ముందే, సమ్మె నోటిసునిచ్చిన వెంటనే కార్మిక శాఖ తరఫున రా జీ ప్రయత్నాలు ప్రారంభమయినట్లుగా పరిగణించా లి. రాజీ ప్రయత్నాలు ముగిసాయని కార్మిక శాఖ ప్రకటించిన వారం రోజుల తరువాత మాత్రమే సమ్మె మొదలు పెట్టాలి. లేబర్ కమిషనర్

కన్సిలియేషన్ ను పొడిగిస్తూ పోతే ఇక సమ్మె చేసే అవకాశమే వుండదు. అలా చేస్తే చట్ట వ్యతిరేక మవుతుంది. అందుకు రు. 20000 నుండి రు.50 000 వరకు జరిమానా లేదా ఒక నెల జైలు శిక్ష విధించ వచ్చు. సమ్మె కి రెచ్చగొట్టారని చెప్పి జైలు పాలు చేయ వచ్చు.

ఈ ప్రతిపాదిత కోడ్ ప్రకారం కొత్త సంఘం రిజిస్ట్రేషన్ కు రిజి స్ట్రార్ ఒప్పుకోవచ్చు లేదా నిరాకరించ వచ్చు. సంఘటిత రంగం లో ఆఫీసు బేరర్సుగా బయటి వారు అసలు వుం డ కూడదు. అసంఘటిత రంగం లో కేవలం ఇద్దరు మాత్రమె ఉండవచ్చు. ఈ నిబంధనల వలన కార్మిక సంఘం ఏర్పాటు దుస్సాధ్యమవుతుంది.

ప్రస్తుతం 100 మంది లోపు కార్మికులు వున్న సంస్థలను ప్రభుత్వ అనుమతి లేకుండా యాజమాన్యాలు మూసి వేయవచ్చు, కార్మికులను రిట్రెంచ్ చేయవచ్చు. కానీ ఈ ప్రతిపాదిత కోడ్ ప్రకారం 300 మంది లోపు వున్న సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ అనుమతి లేకుండానే కంపెనీని మూసి వేయవచ్చు, కార్మికులను రిట్రెంచ్ చేయ వచ్చు. కార్మికుల సంఖ్య 300 కు మించి వున్న ఫ్యాక్టరీలలోకూడా రిట్రెంచ్మెంట్ కు, మూసివేతకు ప్రభుత్వ అనుమతి అవసరమా లేదా అనేది సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి.

ఇంతేగాక ఈ కోడ్, 21 రోజుల నోటీసునిచ్చి ఉద్యోగుల సర్వీసు నిబంధనలను ఏక పక్షముగా మార్చే అధికారాన్ని యాజమాన్యాలకు కట్టబెట్టే విధముగా వున్నది. ఈ పారిశ్రామిక సంబంధాల కోడ్ ను మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదించి మంత్రి మండలి ఆమోదానికి 5.11.2018న పంపింది. మంత్రి మండలి ఆమోదం అనంతరం పార్లమెంటుకి సమర్పిస్తారు.

**<u>సాంఘిక భద్రత మరియు సంక్షేమం కోడ్</u>** సాంఘిక భద్రత చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో "సాంఘిక భద్రత మరియు సంక్షేమం కోడ్" పేరుతో ప్రభుత్వము ప్రతిపాదించిన కోడ్ కు సంబంధించిన వివరాలను పైన 3వ డిమాండ్ వద్ద వివరించాము. ఈ కోడ్ పై సంప్రదింపుల పేరుతో కార్మిక మంత్రిత్వ శాఖ 27.11.2018 న సమావేశం ఏర్పాటు చేసి ట్రేడ్ యూనియన్లను ఆహ్వానించింది. కానీ ఒక్క బిఎంఎస్ మినహా మిగతా అన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్లు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. ఈ కోడ్ పై అంతకు ముందు ట్రేడ్ యూనియన్లు ప్రతిపాదించిన ఏ ఒక్క అంశాన్ని కూడా ప్రభుత్వము ఆంగికరించక పోవటం , అతి తక్కువ వ్యవధిలో ఈ సమావేశానికి నోటీసునివ్వటం ఇందుకు కారణాలు. వివిధ మంత్రిత్వ శాఖలను సంప్రదించిన అనంతరం కార్మిక మంత్రిత్వ శాఖ ఈ కోడ్ ను మంత్రి వర్గ ఆమోదానికి పంపిస్తుంది. సాంఘిక భద్రతా చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో సాంఘిక అభద్రతని సృష్టించటమే ఈ కోడ్ లక్ష్యం

**<u>వేతనాల కోడ్</u>**: వేతనాల చెల్లింపుకు గ్యారంటీ లేకుండా చేయటానికి, ఒకే పనికి రకరకాల వేతనాల చెల్లింపుకు వీలు కలిగించేందుకు, ప్రమోషన్లలో వివక్షతలను అనుమతించటానికి కనీస వేతనాల చట్టం, వేతన చెల్లింపు చట్టం, బోనస్ చట్టం, సమాన వేతన చట్టం –ఈ 4 చట్టాలను కలిపి వేతనాల కోడ్ ను ప్రతిపాదించింది. వేతనాల చట్టాల అమలును పర్యవేక్షించే ఇన్స్పెక్టర్ల వ్యవస్థను రద్దు చే యాలని, పర్యవేక్షణ తప్పనిసరిగా జరగాలనే నిబంధనను తొలగించాలని, సమాన వేతన చట్టం నిబంధనలు రద్దు చేసి కేవలం లింగ వివక్షత కారణముగా సమాన

వేతనాలివ్వక పోవటం ఒక్క దానినే నేరంగా పరిగణించాలని, నియామకం మరియు పదోన్నతిలలో వివక్ష వుండరాదనే అంశాలను ఎత్తివే యాలని ప్రతిపాదించింది. ఈ కోడ్ ప్రకారం యాజమాన్యాలు వేతనాలు సక్రమముగా చెల్లిస్తున్నాయా లేదా పట్టించుకునే యంత్రాంగమే వుండదు. ఒకే పనికి రక రకాల వేతనాలు ఒకే సంస్థలో వుండే పరి స్థితులోస్తాయి. నియామకాలు, పదోన్నతులలో వివక్షతలు ప్రబలుతాయి. ఈ వేతనాల కోడ్ ముసాయిదాని లోక్ సభ ఆమోదానికి ప్రభుత్వము 10.8.2017న సమర్పించింది. ఇది పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనలో వున్నది.

<u>**పని ప్రదేశాలలో భద్రత , ఆరోగ్యం మరియు మెరుగైన పని పరిస్థితుల కోడ్"**</u> పని ప్రదేశాలలో భద్రత , ఆరోగ్యము మరియు మెరుగైన పని పరిస్థితుల కు సంబంధించి ఇప్పుడున్న 16 చట్టాలను రద్దు చేసి వీటన్నింటికి బదులు "పని ప్రదేశాలలో భద్రత, ఆరోగ్యం మరియు మెరుగైన పని పరిస్థితుల కోడ్" ను ప్రతిపాదించి ఇతర మంత్రిత్వ శాఖల సంప్రదింపులకు కార్మిక శాఖ పంపించింది. ఈ కోడ్ 10 మంది లోపు కార్మికులున్న సంస్థలకు వర్తించదు. దీని వలన ఏ రంగం లో నైనా సరే , 95 శాతం కార్మికులకు ఇది వర్తించదు. ఇప్పుడున్న చట్టాల ప్రకారం "సేఫ్టీ కమిటీ" లను 250 మంది పైగా కార్మికులున్న ఫ్యాక్టరీలలో ఏర్పాటు చేయాలి. కానీ ఈ కోడ్ ప్రకారం 500 మందికి పైగా కార్మికులుండే ఫ్యాక్టరీలకే ఈ సేఫ్టీ కమిటీలు వుంటాయి. మొత్తం ఫ్యాక్టరీలలో 500 కు మించి కార్మికులుండే ఫ్యాక్టరీలు కేవలం 2.5 శాతమే. కాబట్టి ఈ కోడ్ ను అత్యధిక కార్మికులకు పని ప్రదేశాలలో భద్రత , ఆరోగ్యములను నిరాకరించటానికే మోడి ప్రభుత్వము ముందుకు తెస్తున్నది.

ఈ కోడ్స్ ను ఫైనలైజ్ చేసి పార్లమెంటు ఆమోదం పొంది చట్టాలుగా మార్చే వరకు ఆగకుండా ఈ లోగానే కార్మిక హక్కులు హరించే రూల్సు ను, కొన్ని చట్టాల ను మార్పు చేస్తున్నది.

<u>**అప్రెంటిస్ చట్టం , కార్మిక చట్టాలు (రిటర్న్స్ మరియు రిజిస్టర్ మెయింటెనెన్స్ చట్టం) , మరియు ఫిక్సెడ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్:**</u> మోడి ప్రభుత్వము కార్మిక సంఘాలతోఎటువంటి సంప్రదింపులు జరపకుండానే పార్లమెంటులో కాంగ్రెస్ మరియు కొన్ని వామపక్షేతర పార్టీల మద్దతుతో అప్రెంటిస్ చట్టాన్ని, కార్మిక చట్టాలు (రిటర్న్స్ సమర్పించటం మరియు రిజిస్టర్లు మెయింటెయిన్ చేయటం నుండి మినహాయింపు) చట్టాన్ని సవరించింది . కాంట్రాక్టు కార్మికులకన్నా తక్కువ వేతనాలు పొందే అప్రెంటిస్ లను పెద్ద సంఖ్యలో నియమించుకునే హక్కు యాజమాన్యాలకు ఇచ్చి, రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య మరింత తగ్గించే విధముగా అప్రెంటిస్ చట్టాన్ని సవరించింది. 40 మంది లోపు కార్మికులుండే సంస్థల యాజమాన్యాలను 16 రకాల చట్టాలకు సంబంధించిన రి టర్న్స్ను సమర్పించాల్సిన అవసరం, రిజిస్టర్లు మెయింటెయిన్ చెయ్యాల్సిన అవసరం లేకుండా (రిటర్న్స్ సమర్పించటం మరియు రిజిస్టర్లు మెయింటెయిన్ చేయటం నుండి మినహాయింపు) చట్టాన్ని సవరించింది. దీ ని వలన దేశం మొత్తం గా వున్న ఫ్యాక్టరీలలో 72 శాతంఫ్యాక్టరీల యాజమాన్యాలు కార్మిక చట్టాల అమలును ఉల్లంఘించటం సులువయింది

**ట్రేడ్ యూనియన్లను కార్మిక హక్కులను దెబ్బ తీసేందుకు మోడి ప్రభుత్వము ఫిక్సెడ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ అమలు కు ఆర్డర్సు ఇచ్చింది.** యాజమాన్యాలు 6 నెలలు, సంవత్సరం లేదా 2 సంవత్సరాలు ఈ విధముగా ఒక ఫిక్సెడ్

టర్మ్ కు ఉద్యోగం యిచ్చి ఆ టర్మ్ పూ ర్తి అవ గానే ఎటువంటి నోటిసు, పరిహారం లేకుండా తొలగిం చెందుకు వీలుగా"ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయ్మెంటు ను అనుమతిస్తూ స్టాండింగ్ ఆర్డర్స్ రూల్సు ను సవరించింది. ఇటువంటిఫిక్స్డ్ టర్మ్ కార్మికులు ట్రేడ్ యూనియన్ ఏర్పరచుకుందామని గాని , తమకి రూల్సు ప్రకారం ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వాలని గాని, వాటిని పెంచాలని గాని కోరే పరిస్థితి వుండదు. కార్మిక హక్కులు హరించేందుకు మోడి ప్రభుత్వము కార్మిక చట్టాలకు చేసిన/తలపెట్టిన ఈ మార్పులను వెంటనే ఉపసంహరించాలి.

6. <u>**రైల్వే, ఇన్సూరెన్సు, డిఫెన్సు, పెన్షన్ వంటి కీలక రంగాలలో ఎఫ్ డి ఐ లను అనుమతించ వద్దు.**</u>

మోడీ ప్రభుత్వముపార్లమెంట్లో కాంగ్రెస్ తో కలిసి ఇన్సూరెన్సు రంగం లో ఎఫ్ డి ఐ పరిమితిని 26 శాతం నుండి 49 శాతం కు పెంచింది. పెన్షన్ రేగ్యులేటరి & డెవలప్మెంట్ అథారిటి చట్టం( దీనినికూడా కాంగ్రెస్, బి జె పి లు కలిసి పార్లమెంటులో ఆమోదించాయి) ప్రకారం ఇన్సురెన్స్ రంగం లో వుండే ఎఫ్ డి ఐ పరిమితి పెన్షన్ రంగం లో కూడా ఆటోమేటిక్ గా వర్తిస్తుంది. కాబట్టి ఇప్పుడు ఇన్సురెన్సు, పెన్షన్ రంగాలలో ఎఫ్ డి ఐ పరిమితి 49 శాతం కు పెంచబడింది.దీనివలన విదేశి, స్వదేశి పెట్టుబడిదారులు ప్రయివేటు పెన్షన్ ఫండ్ కంపెనీలకు ఉద్యోగుల పెన్షన్ నిధులను మరియు ఇ పి ఎఫ్ నిధులను తరలించాలని, మెడికల్ సౌకర్యాలను రద్దు చేసి వాటి స్థానం లో ఆరోగ్య బీమా కు కార్మికులను తరలించి ఆ విధముగా ఇన్సురెన్సు కంపెనీలకు నిధులు సమకూర్చాలని ప్రభుత్వము పై ఒత్తిడిచేయటం పెరుగుతుంది. ఉద్యోగుల ఇ పి ఎఫ్, పెన్షన్, మెడికల్ సౌకర్యాలకు ప్రమాదం పెరుగుతుంది.
దేశ భద్రతకు కీలకమయిన రక్షణ రంగం లో కూడా ఎఫ్ డి ఐ పరిమితిని మోడీ ప్రభుత్వము 49 శాతం నుండి 100 శాతం కు పెంచింది. దిని వలన మన దేశం లో ఆయుధాలు తయారి లో విదేశి పెట్టుబడులు ప్రవేశిస్తాయి. ఆ విధముగా రక్షణ రంగం లో మన స్వావలంబన దెబ్బ తింటుంది. చిన్న ఆయుధాల తయారీలో కూడా విదేశీ పెట్టిబడిని అనుమతించారు. ఫార్మా రంగంలో 100 శాతం విదేశీపెట్టుబడులని అనుమతించారు . ఆపిల్ వంటి సింగల్ బ్రాండ్ ఫోను వుత్పత్తుల విషయములో కొంత భాగం దేశీయంగా సేకరించి అమ్మాలనే షరతును యెనిమిదేళ్లపాటు అమలుచేయనక్కర లేదు. బ్రాడ్ కాస్టింగ్ రంగంలో DTH(డైరెక్ట్ టు హోం )కేబుల్ నెట్ వర్క్ వంటి రంగాల్లో కూడా 100 శాతం విదేశీ పెట్టుబడుల్ని అనుమతించాలని నిర్ణయించారు .
ఇప్పటి వరకు అనుమతించని రైల్వే రంగం లో కూడా రైల్వే ట్రాక్ నిర్మాణం తదితర మౌలిక వసతుల నిర్మాణం లో విదేశి ప్రత్యక్ష పెట్టు బడిని అనుమతించాలని మోడీ ప్రభుత్వ ము నిర్ణయించింది. కీలకమయినరైల్వే ల ప్రయివేటికరణకు, విదేశీకరణకు ఇది దారి తీస్తున్నది.
కాబట్టి రైల్వే, ఇన్సురెన్సు , డిఫెన్సు , పె న్షన్ రం గాలలో ఎఫ్ డి ఐ ని అనుమతించ వద్దని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. **విదేశీపెట్టుబడులు అసలు వద్దని మనవాదన కాదు .** కొత్తటెక్నాలజీని తీసు కు వచ్చే విధంగా, కొత్తగా వుద్యోగాలు సృ ష్టించే విధంగా వుత్పత్తిని పెంచే విధంగా వుంటేనే విదేశీపెట్టుబడుల్ని అనుమతించాలని ట్రేడ్ యూనియన్లు కోరుతున్నాయి .

7. <u>**సమస్త రంగాల కార్మికులు ఉద్యోగులు అందరికీ కనీస పెన్షన్ రు.3000 ఇవ్వాలి , పెన్షన్ కు భద్రత కల్పించాలి.**</u>

ప్రస్తుతం 2004 కి ముందు రిక్రూట్ అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు , డిఓటి నుండి బిఎస్ ఎన్ఎల్ లో విలీనమయిన ఉద్యోగులకు ప్రభుత్వ పెన్షన్ వస్తున్నది. 2004 నుండి రిక్రూట్ అయిన కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వము పెన్షన్ చెల్లించదు. వారికి నూతన పెన్షన్ విధానం అమలులోకి తెచ్చారు. దీని ప్రకారం వారు ప్రతినెలా తమ జీతం నుండి 10 శాతం పెన్షన్ కంట్రిబ్యుషన్ చెల్లించాలి . ప్రభుత్వము కుడా 10 శాతం చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని ఉద్యోగి ఎంపిక చేసుకున్న ఒక పెన్షన్ ఫండ్ కంపెనీకి జమ చేస్తారు. రిటైర్ అయిన తరువాత ఆ ఉద్యోగికి పెన్షన్ ఎంత వస్తుంది, అసలు వస్తుందా రా దా అనేది ఆ పెన్షన్ ఫండ్ కంపెని లాభ నష్టాల ప్రకారం వుంటుంది.

ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న వారిని కూడా ఈ నూతన పెన్షన్ విధానం లోకి ఎప్పుడు కావాలని అనుకుంటే అప్పుడు తరలించి ప్రభుత్వము తన బాధ్యతను వదిలించుకునేందుకు వీలుగా నూతన పెన్షన్ చట్టం (పెన్షన్ ఫండ్ రేగ్యులేతరి & డెవలప్మెంట్ అథారిటి చట్టం) ను పార్లమెంటులో కాంగ్రెస్, బి జె పి లు కలిసి ఆమోదించాయి.

బిఎస్ఎన్ఎల్ లో రిక్రూట్ అయిన వారికి, అనేక ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు , ప్రయివేటు కంపెనీల ఉద్యోగులకు ఇపిఎఫ్ ఎవరికయితే వర్తిస్తుందో వారికి ఇపిఎఫ్ స్కీములో భాగముగా ఇపిఎస్ (ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం) ప్రకారం పెన్షన్ వర్తిస్తుంది. కాని అనేక రంగాలలో ఈ ఇపిఎస్ క్రింద వ చ్చె పెన్షన్ రు.1000 కన్నా చాలా తక్కువగా వుంటూ వచ్చింది. కార్మికోద్యమ పోరాటాల వలన ఈ ఇపిఎస్ స్కీం ప్రకారం వచ్చే పెన్షన్ కనీసం రు.1000 కి తగ్గకూడదని ప్రభుత్వము అంగికరించి ఆర్డర్స్ ఇచ్చింది. కాని అత్యధిక సంఖ్యలో వున్న అసంఘటిత కార్మికులకు ఈ స్కీము వర్తించదు.

బిఎస్ఎన్ఎల్ రిక్రుటిస్ కు డిపిఇ గైడ్ లైన్స్ ప్రకారం వారి బేసిక్ పె లో 30 శాతం మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్సు కు మేనేజిమెంటు ఖర్చు చేయాలి. కాని మేనేజిమెంటు ఇప్పటివరకు 23 శాతాన్ని అది కూడా అనేక పోరాటాలు చేసిన తరువాతనే కంట్రిబ్యుట్ చేస్తున్నది. ఇటీవలనే బిఎస్ఎన్ఎల్ సిఎండి గారు మిగతా మిగతా 7 శాతం లో 3 శాతాన్ని 2019 మార్చి లోగా కంట్రిబ్యుట్ చేస్తామని మిగతా 4 శాతాన్ని ఆ తరువాత అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని అమలు చేయాలి.

2013 సెప్టెంబరులో పార్లమెంటరి కమిటి చేసిన సిఫార్సు ప్రకారం ఇపిఎస్ స్కీము క్రింద ఇచ్చే కనీస పెన్షన్ ను రు. 3000 కు పెంచాలని,ఇందుకు ఇపిఎస్ స్కీముకు ప్రభుత్వ కంట్రిబ్యుషన్ ను బేసిక్ పె లో 1.16 శాతం నుండి 8.33 శాతం కు పెంచాలని 2013 సెప్టెంబరులో పార్లమెంటరి కమిటి సిఫార్సు చేసింది. కాని యుపిఎ ప్రభుత్వము వలెనే మోడి ప్రభుత్వము కూడా ఇందుకు అంగీకరించలేదు. కార్మికులందరికీ గ్యారంటి పెన్షన్ విధానం వుండాలని, సంఘటిత అసంఘటిత కార్మికులందరికీ అది వర్తించాలని, ఇపిఎస్ కాని మరి ఏ ఇతర పథకం ప్రకారం కాని ఇచ్చే పెన్షన్ కనీసం రు. 3000కు తగ్గకుండా వుండాలని, 1.1.2004 తరువాత రిక్రూట్ అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానం రద్దు చేసి వారికి కూడా ప్రభుత్వ పెన్షన్ విధానం వర్తింపజేయాలని, ప్రభుత్వ పెన్షన్ విధానానికి గ్యారంటి ఇవ్వాలని, బిఎస్ఎన్ఎల్ లో విలీనమయిన డి ఓ టి ఉద్యోగులకు పైన తెలియజేసిన ఇబ్బందులు లేకుండా పెన్షన్ ను మరియు పెన్షన్ రివిజన్ ను గ్యారంటీ చేయాలని , బిఎస్ఎన్ఎల్ మరియు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో రిక్రూట్ అయిన వారికి డిపిఇ గైడ్ లైన్స్ ప్రకారం 30 శాతం రిటైర్మెంట్ బెనిఫిట్సు వర్తింపజేసే విధముగా భద్రత కలిగిన ఒక పెన్షన్ విధానం రూపొందించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

**8. కనీస వేతనం రు.18000 కు తగ్గ కూడదు. ధరల పెరుగుదలకి అనుగుణముగా దీనిని పెంచాలి.**

కనీస వేతనాన్ని ఏ ప్రాతిపదిక పై నిర్ణయించాలనే దాని పై 1957 లో జరిగిన 15వ భారత కార్మిక సదస్సు(15th Indian Labour Conference) లోప్రభుత్వ, యాజమాన్యాల, కార్మిక సంఘాల ప్రతినిధులందరూ కలిసి చర్చించి ఏక గ్రివముగా ఒక ఫార్ములాను సిఫారసు చేశారు. ఈ సిఫార్సు న్యాయ సమ్మతమయినదని, మారిన పరిస్థితులలో దీనిని మరింత మెరుగు పరచాలని, ఈ సిఫార్సు ప్రకారం ఇ వ్వాల్సిన మొత్తానికి అదనముగా మరో 25 శాతాన్ని పిల్లల చదువు, వైద్యం, పండగలు, పెళ్ళిళ్ళు, రిక్రియేషన్, వృద్ధాప్యం లో వుండే అవసరాలకు గాను కలపాలని సుప్రీం కోర్టు 31.10.1991 న "వర్క్ మెన్ వర్సస్ రాప్టకోస్ బ్రెట్ & కో మేనేజిమెంటు " కేసులో తీర్పునిచ్చింది.

15వ కార్మిక సదస్సు సిఫార్సు ప్రకారం లెక్కిస్తే 1.5.2014 నాడు ఢిల్లీ, ముంబాయి, కలకత్తా, చెన్నై, హైదరాబాదు, బెంగలూరు, భువనేశ్వర్, త్రివేండ్రం నగరాల సగటు ధరల ప్రకారం కనీస వేతనం రు.15647లు అవుతుంది. దీనికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మరో 25 శాతం కలిపితే రు.20861లుఅవుతుంది. 6వ పే కమిషన్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కనీస వేతనం రు. 18000 వుండాలని సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వము దీనిని అమలు చేసింది. కాబట్టి పట్టణాలతో పాటు గ్రామాలకు దే శమంతటికి అన్ని రంగాలకు వర్తించే విధముగా కనీస వేతనం **రు.** 18,000/- లు ఇవ్వాలని, ధరల పెరుగుదలకు అనుగుణముగా దానిని పెంచాల ని కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఏకగ్రీవముగా డిమాండ్ చేస్తున్నాయి.

**9. <u>శాశ్వత పనికి కాంట్రాక్టు వర్కర్లను నియమించ రాదు. వారిని రెగ్యులరైజ్ చేయాలి. కాంట్రాక్టు వర్కర్లకు రెగ్యులర్ వర్కర్లతో సమాన వేతనం ఇవ్వాలి.</u>**

కాంటాక్టు లేబర్ (రెగ్యులేషన్& అబాలిషన్ )చట్టం ప్రకారం పెర్మనెంటు పనులకు కాంట్రాక్టు వర్కర్లను నియమించకూడదు. కానిప్రభుత్వశాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలతో సహా అన్ని రంగాలలో పర్మనెంటు పనులను కాంట్రాక్టు వర్కర్సుతో చేయిస్తున్నారు. ప్రభుత్వ రంగ కార్మికుల్లో 50 శాతం, ప్రయివేటు రంగం లో 70 శాతం కాంట్రాక్టు కార్మికులే. కాబట్టి శాశ్వత స్వభావం గల పనులను చేస్తున్న కాంట్రాక్టు వర్కర్లను రెగ్యులర్ చేయాలి. బిఎస్ఎన్ఎల్ లో శాశ్వత స్వభావం గల పనిని అనేక చోట్ల క్యాజువల్ మరియు కాంట్రాక్టు కార్మికులతో చేయిస్తున్నారు. వారందరినీ రెగ్యులర్ చేయాలి.

కాంట్రాక్టు కార్మికులకు అదే పని చేసే రెగ్యులర్ వర్కర్సుతో సమంగా వేతనాలు , ఇతర ప్రయోజనాలు ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనం అనేది రాజ్యాంగం ఆర్టికిల్ 16 ఇచ్చిన హక్కు. కాని దీనిని సాధారణంగా అమలు చేయటం లేదు. ఒకే పనికి ఒకే వేతనం అమలు జరిగేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. సుప్రీం కోర్టు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పునిచ్చింది. బిఎస్ఎన్ఎల్ లో క్యాజువల్, కాంట్రాక్ట్ కార్మికులకు వారు ఏ కేడర్ పని చేస్తున్నారో ఆ కేడర్ కు సంబంధించిన పే స్కేల్ ప్రకారం వేతనం, ఇతర ప్రయోజనాలుఇవ్వాలి.

**10. ధరల పెరుగుదలను ఆపాలి. ఇందుకోసం ప్రజాపంపిణీ వ్యవస్థని సార్వత్రికం చేయాలి మరియు సరుకుల వ్యాపారం లో ఊహాజనిత వ్యాపారాన్ని నిషేధించాలి.**

నిత్యావసర సరుకుల ధరలు నిరంతరం పెరుగుతున్నాయి. ఆహార వస్తువుల ధరలు మరింతగా పెరుగుతున్నాయి. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు డి ఏ రేటు 2007 జనవరి లో 0 కాగా 1.1.2019 నాటికి 138.8 శాతం అయిందంటే ధరల పెరుగుదల ఏ స్థాయిలో వున్నదో తెలుస్తున్నది. డి ఏ లేకుండా తక్కువ వేతనాలు పొందే కార్మికుల పరిస్థితి ధరల పెరుగుదల వలన మరింత బాధాకరంగా వుంటున్నది. అంతర్జాతీయముగా పెట్రోలియమ్ ధరలు బాగా తగ్గాయి. ఆ మేరకు పెట్రోలు , డిజేలు ధరలు తగ్గాలి. పెటోలు , డిజిల్ ధరలు తగ్గితే రవాణా ఛార్జీలు , ఇంధన ఛార్జీలు తగ్గి సరుకుల ధరలు తగ్గుతాయి. ఇంతేగాక డిజిల్ ధరలు తగ్గితే బిఎస్ఎన్ఎల్ కు డిజెల్ ఖర్చు ఆ మేరకు తగ్గి నష్టాలు తగ్గుతాయి. కానీ మోడి ప్రభుత్వము పెట్రోలు, డిజేలు పై విపరీతముగా పన్నులు విధించి వాటి ధరలు తగ్గకుండా చేసింది. ఇప్పుడు అంతర్జాతీయముగా పెట్రోలు ధర కొంత పెరిగినా మన దేశం లో పెట్రోలు ధరలు ఈ స్థాయిలో వుండాల్సిన అవసరం లేదు. పెట్రోల్/డీజిల్ పై విధించిన అధిక పన్నులను రద్దు చేసి వాటిని ఉత్పత్తి ఖర్చుకు తగు లాభం కలిపిన రేటుకు అమ్మే విధానాన్ని అమలు చేయాలి. నిత్యావసర సరుకుల అక్రమ నిల్వలు స్పెక్యులేషన్ లు ధరల పెరుగుదలకు కారణం. కాబట్టి నిత్యావసర సరుకుల విషయం లో ఫార్వర్డ్/ఫ్యూచర్స్ ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న స్పెక్యులేషన్ ను నిషేధించాలి. నిత్యావసర సరుకుల అక్రమ నిల్వలను అనుమతించకూడదు. ప్రజాపంపిణీ వ్యవస్థను సార్వత్రికరించి ఆదాయముతో నిమిత్తము లేకుండా అందరికీ వర్తింపజేయాలి.

**11. <u>ఉద్యోగిత పెరిగేందుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. తద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించాలి.</u>**

మన దేశం లో నిరుద్యోగం ప్రధాన సమస్య. ఈ సమస్యని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కాని సరళీకరణ విధానాలలో భాగముగా 1991 నుండి క్రమంగా ప్రభుత్వము ఈ బాధ్యత నుండి వైదొలగుతున్నది. ప్రభుత్వమే రిక్రుట్మెంట్ పై నిషేధం విధించింది. ఖాళీలను భర్తీ చేయటం లేదు. పోస్ట్ లను రద్దు చేస్తున్నది. పనులను అవుట్సోర్సింగ్ కు ఇస్తు న్నది. ప్రభుత్వ శాఖల్లో , ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య పెద్ద ఎత్తున తగ్గుతున్నది. ప్రభుత్వ రంగం , ప్రయివేటు రంగం అంతటా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య తగ్గి క్యాజువల్ , కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరుగుతున్నది. ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాల సంఖ్య భారిగా తగ్గించినందున సామాజిక న్యాయం కుంటుపడుతున్నది.

గత యు పి ఏ ప్రభుత్వము వలెనే నేటి మోడి ప్రభుత్వము కూడా ఉద్యోగాల కల్పన ప్రభుత్వ బాధ్యత అని భావించటం లేదు. కార్పొరేట్సుకు రాయితీలిస్తే వారు నిరుద్యోగ సమస్యని పరిష్కరిస్తారనే తప్పుడు సిద్ధాంతాన్ని అది ముందుకు తెస్తున్నది. కానీ ఎన్ని రాయితీలిచ్చినా వాటితో కార్పొరేట్సు అనుచిత లాభాలు పెంచుకుంటున్నారె గాని ఆర్థిక మాంద్యాన్ని , నిరుద్యోగ సమస్యని పరిష్కరించటం లేదు. ఇంతేగాక మోడి ప్రభుత్వము అమలు చేసిన నోట్ల రద్దు మరియు జి ఎస్ టి విధానాల వలన అనేక చిన్న పరిశ్రమలు మూత పడి నిరుద్యోగ సమస్య మరింత

పెరిగింది. నోట్ల రద్దు వలన 35 లక్షల మండి ఉద్యోగాలు కోల్పోయారు. 62907 గ్రూప్ డి వేకెన్సీలకు 2018 సెప్టెంబరు 17 న జరిగిన రైల్వే రిక్రూట్మెంట్ పరీక్షకు 1.9 కోట్ల మంది అప్లై చేశారు. ఉత్తర ప్రదేశ్ లో 400 క్లాస్ 4 వేకెన్సీలకు జరిగిన పరీక్షకు 23 లక్షల మండి అప్లై చేశారు. వీరిలో 50000 మం ది గ్రాడ్యుయేట్ లు. ఏప్రిల్ 2018 నుండి జూన్ 2018 వరకు 3 నెలల కాలం లో జీడీపీ (స్థూల జాతీయ ఉత్పత్తి) 8.2 శాతం పెరిగింది. కానీ ఇదే కాలం లో ఉద్యోగిత 1 శాతం తగ్గింది. ప్రజల కొనుగోలు శక్తి తగినంతగా పెరగనందున ఏర్పడిన ఆర్థిక మాంద్యమే దీనికి కారణం. ఉద్యోగిత వుం టేనే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇందుకు ప్రభుత్వము బాధ్యత తీసుకుని ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

అ)కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో రిక్రూట్మెంట్ పై విధించిన నిషేధాన్ని తొలగించాలి.

ఆ)ఖాళీగా వున్న పోస్ట్ లను రద్దు చేయకుండా భర్తీ చేయాలి.

ఇ) ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో అవుట్సోర్సింగ్ ని ఆపాలి.

ఉ) పని దొరకని అందరికి పని కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మెరుగు పరచాలి. ఈ పథకం క్రింద కల్పించే పని రోజులపై 100 రోజుల పరిమితిని తొలగించాలి. పట్టణాలకు కుడా ఇటువంటి ఉపాధి హామీ పథకం కనీస వేతనం తో అమలులోకి తేవాలి.

ఊ) స్వయం ఉపాధి, స్వయం సహాయక పథకాలకు మరియు చిన్న పరిశ్రమలకు తగిన ఆర్థిక మద్దతు ఇవ్వాలి.

ఏ)నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలి. ఎమ్ప్లాయ్మెంట్ ఎక్స్చేంజి లను ఆధునికరించాలి.

## 12. అప్లికేషన్ పెట్టిన 45 రోజులలోగా ట్రేడ్ యూనియన్ ను రిజిస్టర్ చేయాలి. ఐ ఎల్ ఓ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) కన్వెన్షన్ 87, 98 లను ప్రభుత్వము వెంటనే ఆమోదించాలి.

ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసుకున్నందుకు కార్మికులను తొలగించటం, నాయకులపై దాడి చేయటం అనేక చోట్ల జరుగుతున్నది. ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రేషన్ కు పెట్టు కున్న వేలాది అప్లికేషన్లు పెండింగులో ఉంటున్నాయి. ఈ పరిస్థితి కొనసాగ కూడదని, అప్లికేషన్ పెట్టిన 45 రోజులలోగా యూనియన్ రిజిస్ట్రేషన్ కు ఆమోదం ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ ఎల్ ఓ) ఆమోదించిన కన్వెన్షన్ 87 ప్రకారం ప్రభుత్వము మరియు యాజమాన్యాల జోక్యం లేకుండా ట్రేడ్ యునియన్లను ఏర్పాటు చేసుకునే హక్కు ఎటువంటి వివక్షతా లేకుండా కార్మికులందరికీ వుండాలి. కానిభారతదేశం లో ప్రభుత్వోద్యోగులకు ట్రేడ్ యునియన్ పెట్టుకునే హక్కు లేదు. అసోసియేషన్లు మాత్రమే పెట్టుకోవాలి. సంస్థలో 10 శాతం కానీ లేదా 100 మంది కానీ , ఏది తక్కువయితే అంత మంది వుంటేనే యూనియన్ ఏర్పాటు చేసుకోవాలని ట్రేడ్ యునియన్ చట్టం చెపుతున్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థ కన్వెన్షన్ 87ప్రకారం ట్రేడ్ యునియన్ పెట్టుకునే హక్కు పై ఇటువంటి ఆంక్షలు, వివక్షతలు వుండ కూడదు. కావున భారత ప్రభుత్వము ఈ కన్వెన్షన్ 87 ను ఆమోదించి ట్రేడ్ యునియన్ హక్కులపై గల ఆంక్షలు తొలగించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అంతర్జాతియ కార్మిక సంస్థ కన్వెన్షన్ 9 8ప్రకారం కార్మికులకు సమిష్టి బేరం హక్కు వుండాలి. రహస్య బ్యాలట్ లో గుర్తింపు పొందిన మెజారిటి కార్మిక సంఘం /సంఘాలతోనే మేనేజిమెంటు చర్చించి ఒప్పందాలు చేసుకోటం సమిష్టి బేరం సారాంశం. రహస్య బ్యాలట్ ప్రకారం యూనియన్ గుర్తింపు అనేది పరిమితముగా ప్రభుత్వ రంగ సంస్థలలో మరియు కొన్ని ప్రయివేటు కంపెనీలలో మాత్రమే అమలు జరుగుతున్నది. అనేక చోట్ల అమలు కావటం లేదు. మేనేజిమెంట్లు కార్మికులతో విడి విడిగా, లేదా కార్మికుల మద్దతు లేని తమ జేబు సంఘాలతో చర్చలు జరిపి ఒప్పందాలు చేస్తున్నాయి.కాబట్టి భారత ప్రభుత్వము అంతర్జాతీయ కార్మిక సంస్థ కన్వెన్షన్ 98 ని ఆమోదించి దాని ప్రకారం సమిష్టి బేరం హక్కును కార్మికులకు ఎటువంటి వివక్షత లేకుండా అమలు చేయాలి.

## కార్మిక సంఘాల ప్రత్యామ్నాయం

కార్మికుల, రైతుల, పేద ప్రజల హక్కులను, సంక్షేమాన్ని ఈ విధముగా రద్దు చేసి వారిని బానిసలుగా మారిస్తేనే విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు సంతోషించి పెట్టుబడులు పెట్టి దేశాన్ని అభివృద్ధి చేస్తారనేది దివాలా కోరు సిద్ధాంతం. ఇందుకు విరుద్ధముగా కార్మికసంఘాలన్నీ ( బి ఎం ఎస్ మినహా) కలిసి దేశాభివృద్ధికి ఈ కింది ప్రతిపాదనలు చేసాయి:

ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వము మౌలిక వసతుల నిర్మాణానికి పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టాలి. ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ రంగమే నాయకత్వ పాత్ర వహిం చాలి. విద్య , వైద్యం , త్రాగు నిరు, గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం , తదితరాలకు ప్రభుత్వ ము కే టాయింపులను పెంచాలి. ఇదంతా చేయటానికి అవసరమయిన వనరులను సమ కూర్చుకోటానికి సంపన్న వర్గాలపై పన్నులు పెంచాలి. రు.5 లక్షలకోట్లు పైగా వున్న కార్పోరేట్ పన్ను బకాయిలు మరియు సంపన్నుల ఆదాయపు పన్ను బకాయిలు వసూలు చేయాలి. కార్పోరేట్సుకు ప్రతి సంవత్సరం 5 లక్షల కోట్ల రూపాయిలకు పైగా అనుచితముగా యిస్తున్న రాయితీలను రద్దు చేయాలి. కార్పోరేట్లు బ్యాంకులకు ఎగగొట్టిన బకాయిలను వసూలు చేయాలి. మన దేశం విదేశాలకు ఎంత అప్పు ఉన్నదో అం తకు రెండింతలుగాఅక్రమముగా విదేశాలకు తరలి వెళ్ళిన నల్ల ధనాన్ని వెనక్కి తీసుకు రావాలి. ఈ విధముగా సమకూరే నిదులతో ప్రజలకి అనుకూలమయిన విధానాలను రూపొందించాలి. ఈ ప్రత్యామ్నాయాన్ని అమలు చేస్తే దేశ అభివృద్ధికి , కార్మికుల, ఉద్యోగుల, ప్రజల కోరికలు నెరవేర్చటానికి తగిన వనరులు సమకూరుతాయి. దీనితో కార్మికులందరికీ, ప్రజలందరికి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి.కార్మికులు, ఉద్యోగులు 12 డిమాండ్స్ ను, ప్రజల కోరికలను నెరవేర్చాలి. ఉద్యోగావకాశాలను, ఉత్పత్తిని పెంచి ఆర్థిక వ్యవస్థను అభి వృద్ధి చేయాలి.

బిజెపి, కాంగ్రెస్, టి డి పి , వైసీపీ, టి ఆర్ ఎస్ తదితర పెట్టుబడిదారుల భూస్వాముల పార్టీలు వాటి ప్రభుత్వాలు అన్నీ ఈ సరళీకరణ-ప్రయివేటీకరణ-ప్రపంచీకరణ విధానాలనే అనుసరిస్తాయి. సారాంశం లో ఈ పార్టీల ఆర్థిక విధానాలు ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక ఆర్థిక విధానాలే. దేశాన్ని స్వదేశీ విదేశీ బడా పెట్టుదారులు దోచుకునేందుకు అనుమతించే విధానాలే. అందు వలన ఇవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయం కాదు. వీరు ఒకరిపై ఒకరు చేసే విమర్శలలో కూడా వ్యక్తిగత దూషణలే గాని విధానపరమైన చర్చ వుండదు. ఒక వంక దేశాన్ని అమ్ముతూ తామే దేశభక్తులమని, తమ విధానాలను వ్యతిరేకించే వారంతా దేశ ద్రోహులెనని చెప్పుకునే ఆర్ ఎస్

ఎస్ బిజెపి లు కార్మిక వ్యతిరేక , ప్రజా వ్యతిరేక విధానాలను ఉధృతముగా అమలు చేస్తూ మరో వంక ఈ విధానాలకు ప్రజలనుండి ప్రతిఘటన లేకుండా వుండేందుకు మతం పేరుతో , సంస్కృతి పేరుతో ప్రజల మధ్య ఉద్రిక్తతలను సృష్టిస్తున్నాయి. వీరు చెప్పే సంస్కృతి ప్రజా వ్యతిరేక ఆధిపత్య సంస్కృతి. ప్రజాస్వామిక హక్కులపై ఈ శక్తులు దాడి చేస్తున్నాయి. మతోన్మాద ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు ఈ శక్తులు చేస్తున్న విష పూరితమయిన ప్రచారాన్ని కార్మిక వర్గం తిరస్కరించి ఐక్యతని కాపాడుకోవాలి.

వామపక్ష ప్రజాస్వామిక శక్తులకు కార్మికోద్యమానికి , ప్రజా సంఘాలకు మాత్రమే ఈ విధాన పరమయిన ప్రత్యామ్నాయం వున్నది. పై 12 డిమాండ్సు ఈ విధాన పరమయిన ప్రత్యామ్నాయం లో ఒక భాగం. 1 శాతం సంపన్నులకు దేశ సంపదను ప్రజల కష్టార్జితాన్ని దోచి పెడుతూ స్వదేశీ విదేశీ బడా పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్న ఈ విధానాలకు ప్రత్యామ్నాయంగా 99 శాతం గా వున్న ప్రజలకు కార్మిక వర్గానికి అనుకూలముగా వుండే విధానాల కోసం కార్మిక వర్గం పోరాడాలి. ఈ పోరాటం లో భాగమే 2019 జనవరి 8,9 తేదీలలో జరుగు రెండు రోజుల దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె. ఈ సమ్మెలో పాల్గొని తమ దేశ భక్తిని ప్రకటించాలని , ప్రభుత్వ రంగ సంస్థలను అందులో భాగముగా బిఎస్ ఎన్ఎల్ ను, కార్మిక హక్కులను, ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు మరియు మన రక్షణ రంగాన్ని మన ఆర్థిక ప్రయోజనాలను సామ్రాజ్య వాదులకు తాకట్టు పెట్టె విధానాలను తిరస్కరించేందుకు , ప్రజల మధ్య ఐక్యతను మత సామరస్యాన్ని పెంపొందించెందుకు అన్ని రంగాల కార్మికులు , ఉద్యోగులతోపాటు ఈ రెండు రోజుల సార్వత్రిక సమ్మె లో పాల్గొనాలని బి ఎస్ ఎన్ ఎల్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

## బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్